క్లుప్తంగా

క్రీడలను ప్రోత్సహించాలి

ఆలమూరు: విద్యార్థి దశ నుంచే క్రీడలను ప్రోత్సహించాలని, విద్యార్థులు అన్నింటా రాణించాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. జొన్నాడలో ఇటీవల అండర్-7 విభాగంలో జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన సీహెచ్ పోషణ రితికను మంగళవారం రాత్రి స్వయంగా ఎమ్మెల్యే వెళ్లి అభినందించారు. భవిష్యత్‌లో చెస్ పోటీల్లో మరింత రాణించాలన్నారు. ఈనెల 27న తమిళనాడులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో అవార్డును సాధించాలని ఆకాంక్షించారు. సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంధ్ర నాగమోహన్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలను కాపాడుకోవాలి



శంకరగుప్తంలో చెడుగుడు పోటీలను ప్రారంభిస్తున్న ముత్యాల కాశీ

మలికిపురం: సాంప్రదాయ క్రీడలను కాపాడుకోవాలని మాజీ ఎంపీపీ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల కాశీ పేర్కొన్నారు. శంకరగుప్తం గ్రామం నల్లివారి గ్రూపులో బుధవారం నుంచి చెడుగుడు పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ముత్యాల కాశీ ప్రారంభించారు. సీసీఎఫ్ సొసైటీ చైర్మన్ చింతా కుమార్ రాజా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ సాగిరెడ్డి బుజ్జి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షులు ఓగూరి హనుమంతరావు కొంబత్తుల చంద్రశేఖర్, నేత శ్రీను, అధ్యాపకులు నక్కా రమేష్ బాబు, యడ్ల పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న ట్రస్టు బోర్డు చైర్మన్ రామకృష్ణ

మామిడికుదురు: బాలబాలాజీ స్వామి వారి ఆలయ వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి వర్ధంతి సందర్భంగా బుధవారం పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న రామస్వామి, ఆదిలక్ష్మి విగ్రహాలకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, కార్యనిర్వహణాధికారి ఎంకేటీ నాగవరప్రసాద్, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామస్వామి సేవలను కొనియాడారు. ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, బత్తుల విజయగంగారత్నం, గూటం శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు, స్థానికులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రచనలు ఎంతో ఆదర్శం

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచనలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదర్శంగా నిలిచాయని, అటువంటి రచనలను విమర్శిస్తే సహించమని కడలి గ్రామానికి చెందిన అంబేడ్కర్ సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కడలి సెంటరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిని సమావేశంలో ఇటీవల సరిపల్లి రాజేష్ ప్రపంచ మేధావి అయిన అంబేడ్కర్ రచనలపై చేసిన విమర్శలు దళిత లోకాన్ని బాధించాయన్నారు. వెంటనే రాజేష్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ గంజి అనంతం, మానవహక్కుల సంఘ నాయకుడు తోట సుభాష్, బొంతు సునీల్, యెలుమర్తి రాము, బొడ్డపల్లి పుల్లయ్య, మేడిది రాజేష్, మురళి, కుసుమ శ్రీను, రాజేష్, నామవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



రాయపల్లి ప్రసాద్

కొత్తపేట: మతి స్థిమితం లేని వ్యక్తి కనిపించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు అడిషనల్ ఎస్సై డి.శశాంక తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం జిల్లా మక్కువ మండలం పెద్దవలస గ్రామానికి చెందిన రాయపల్లి గోపాలం అతని కుటుంబంతో సహా స్థానిక తొగరిపాయ కైలాస భూమి వద్ద బైరిశెట్టి వీరవెంకటసత్యనారాయణకు చెందిన ఇటుక బట్టీలో పనిచేస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా మతిస్థిమితం లేని అతని కుమారుడు రాయపల్లి ప్రసాద్(26) కనిపించకుండాపోయాడు. దానిపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు శశాంక తెలిపారు. అదృశ్యమైన యువకుడు ప్రసాద్ నీలంరంగు టీషర్టు, నలుపు రంగు ప్యాంటు, కుడి చేతిపై నాగ సర్పం పచ్చబొట్టు ఉంటుందని తెలిపారు. అతను ఎవరికైనా కనిపిస్తే కొత్తపేట ఎస్సై 9440904842 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

విద్యకు సర్కారు పెద్దపీట

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



మామిడికుదురులో మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ తదితరులు



ఇసుకపూడిలో స్టడీమెటీరియల్ అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

మామిడికుదురు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగన్ సర్కారు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నర్నారని జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ ఉచితంగా అందించిన జగనన్న విద్యా భారతి స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. మండల పరిధిలోని నగరం, మొగలికుదురు, లూటుకుర్రు హైస్కూల్ విద్యార్థులకు సైతం అందజేశామన్నారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓ కె.ప్రసాదరాజు, పీఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు,హెచ్‌ఎం నిరంజని పాల్గొన్నారు.

అంబాజీపేట: పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా ఏకాగ్రతతో చదవడంతో మంచి మార్కులు సాధిస్తారని జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ఇసుకపూడి జెడ్పీ హైస్కూల్‌లో విద్యా భారతి స్టడీ మెటీరియల్స్‌ను ఎంఈఓ డి.కిష్టోఫర్ కొర్నెలియస్, ఎంపీడీఓ ఐ.రత్నంరాజుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఇసుకపూడిలో 30 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను అందించారు. ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ప్రశాంత్, కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ వీటిని అందజేశారు. హెచ్‌ఎం మద్దాలి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ జాన లక్ష్మీ దుర్గ సూర్యావతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముప్పర్తి శ్రీనివాసరావు, జాన రాజు, అటారం మాష్టారు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎంఈఓ ఎం.హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాలుర, బాలికల హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, ఎంపీటీసీ గూటం తిమోతిప్రకాష్‌రావు, కోట విజయకుమారి, పీఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎంలు సువర్ణకుమారి, సుబ్బురాజు పాల్గొన్నారు.

ఆలమూరు: స్థానిక బొబ్బా జయశ్రీ జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు జగనన్న విద్యా భారతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక పాఠశాల ఆవరణలో సర్పంచ్ నేలపూడి లావణ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గా భవానీ, ఎంపీటీసీలు ఉన్నమట్ల విజయకుమారి, గంగుల నాగజ్యోతి, పీఎంసీ చైర్మన్ యిరుకొండ దుర్గ, వైఎస్సార్‌సీపీ నేత అధ్యక్షుడు రావాడ సత్తిబాబు పాల్గొన్నారు.

రాజోలు: తాటిపాక ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఏస్తేరు రాణిలు విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పీఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల మేరికుమారి, బొంతు రమేష్, గటిగంటి రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పి.గన్నవరం: రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పోతవరం ప్రాథమిక పాఠశాలలో బుధవారం మమత స్వచ్ఛంద సేవాసమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలు, బహుమతులను ఎంపీపీ అంబటి భూలక్ష్మి అందజేశారు. నాయకులు మోకా రత్నరాజు, నల్లా పెదకాపు, నేలపూడి రామకృష్ణ, వెంకటేష్, మల్లిఖార్జున్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పైపులైన్ పనులకు భూమిపూజ

మామిడికుదురు: జల జీవన్ మిషన్ నిధులతో లూటుకుర్రు శివారు బాడిలంకలో చేపట్టే పైపులైన్ పనులకు స్థానిక సర్పంచ్ అడబాల తాతకాపు బుధవారం భూమి పూజ చేశారు. ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్ పరిశీలన

మలికిపురం: బట్టేలంక గ్రామం రామదాసుపాలెం పాఠశాలలో బుధవారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్నం భోజనం నాణ్యత పరిశీలించారు. పిల్లలతోపాటు ఆయన కూడా అక్కడ భోజనం చేశారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

సహారాలో చెల్లింపులు వెంటనే చేయాలి

రావులపాలెం: స్థానిక సహారా ఇండియా బ్రాంచి వద్ద బుధవారం ఫీల్డ్ వర్కర్లు ఖాతాదారులు సమావేశం జరిగింది. ఫీల్డ్ వర్కర్లు బల్లా నరేష్, ఎస్‌వీ సత్యనారాయణ, డీఎస్ రాజు, మహ్మద్ బాషా తదితరుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మెచ్యూరిటీ గడువు దాటి చెల్లింపులను వెంటనే సంస్థ చెల్లించాలని వారు డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెచ్యూరిటీ దాటిన ఖాతాదారులకు సుమారు 12 సంవత్సరాల నుంచి ఎటువంటి చెల్లింపులు చేయడం లేదని ఆరోపించారు. ఖాతాదారులకు పేమెంట్లు ఇచ్చే వరకూ సంస్థలో ఏ విధమైన రిసీట్లు కట్ చేయకూడదని తీర్మానం చేసుకున్నట్టు వారు ప్రకటించారు. సంస్థ చెల్లింపులు చేయకపోతే రానున్న రోజుల్లో తమ పోరాటాన్ని మరింతగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఆలమూరు: సంధిపూడిలో ఇటీవల మృతి చెందిన సిద్ధిరెడ్డి దుర్గారావు (46) కుటుంబాన్ని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి బుధవారం పరామర్శించారు. స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయం పక్కన ఉన్న మృతుని నివాసానికి వెళ్లి సోదరులు సిద్ధిరెడ్డి శివ, రాంబాబులను పరామర్శించి తమ సంతాపాన్ని తెలియజేశారు. మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు తమ సానుభూతినిని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్థానిక పార్టీ నేతలతో కలిసి మృతుడు దుర్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.



సంధిపూడి మృతుడు దుర్గారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

మామిడికుదురు: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని స్థానిక దీప్తి స్కూల్ విద్యార్థులు బుధవారం పిరమిడ్ ఆకారంలో ఏర్పడి జాతీయ జెండాలతో చేసిన ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. స్కూల్ కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు త్రివర్ణ పతకాలతో సందడి చేశారు.



విద్యార్థుల ప్రదర్శన

ప్రజల సంక్షేమమే లక్ష్యం

కొత్తపేట 'గడప గడపకూ'లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: ఒక పక్క ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, మరో పక్క సమస్యలను పరిష్కరించడమే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక ఏనుగులమహల్ గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏనుగుల మహల్ కాలిబాట వంతెన సెంటర్ నుంచి శీలంవారిపాలెం, నక్కావారిపేట వరకూ, తిరిగి గంటి ప్రాంతంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను, వాటి ద్వారా పొందే లబ్ధిని వివరించారు. పలువురు జగ్గిరెడ్డికి సాదరంగా స్వాగతం పలికి పూలమాలలు వేసి కృతజ్ఞతలు చాటుకున్నారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేద్దామన్నారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ ఓటర్లు నెల్లి లక్ష్మీపతిరావు (మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు), సాదు చెంచయ్య (మందపల్లి వీడీసీ కన్వీనర్)లను జగ్గిరెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ముసునూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల బ్రహ్మానందం, మందపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ సలాది బాబ్జి, సచివాలయ ఇన్‌చార్జి మూర్కొండ చంద్రరావు, తోరాటి గణేష్, జోగి గోవిందు, పీఏసీఎస్ పర్సన్ డీఎస్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు మట్టపర్తి సూర్యచంద్రరావు, పితాని రాంబాబు, జిల్లా ఎస్సీ నాయకుడు కుర్రా శ్రీను నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కొత్తపేట ఏనుగులమహల్ గ్రామంలో పథకాలే వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఓట్లు అడిగే అర్హత వైఎస్సార్ సీపీకే ఉంది

- ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు
- బట్టేలంకలో గడపగడపకూ మన ప్రభుత్వం

మలికిపురం: రాష్ట్రంలో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే అర్హత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే ఉందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం బట్టేలంక గ్రామంలో మూడో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రాపాక పాల్గొని ఇంటింటికీ తిరిగారు. ప్రజలకు ప్రభుత్వ పరంగా అందుతున్న సంక్షేమ పథకాలను ఆరా తీశారు. మూడున్నరేళ్లలో పథకాల ద్వారా ప్రజల పొందే లబ్ధిని వివరించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. సొసైటీ చైర్మన్ పెమ్మాడి సోమరాజు, పార్టీ నాయకులు కూనపరాజు లచ్చి రాజు,సుబాష్ రాజు, బోనం సురేష్, గుబ్బల శ్రీనివాస్, కొల్లు శిఖామణి,మందపాటి ప్రభుదాసు, రత్నరాజు, మనోహర్, పంచాయతీ కార్యదర్శి శుభాకర్, వీఆర్వో నాగబాబు పాల్గొన్నారు.



బట్టేలంకలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

జాతీయ రహదారి పనులకు సహకరించాలి

భూ యజమానులతో జేసీ ధ్యాన్‌చంద్

రాజోలు: జాతీయ రహదారి పనులకు రైతులు సహకారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ కోరారు. బుధవారం రాజోలు తహసీల్దారు కార్యాలయంలో జేసీ మండల పరిధిలో కొనసాగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం సేకరించిన భూమి యజమానులు, రైతులతో సమావేశమయ్యారు. భూసేకరణలో రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా పరిహారం అందిచాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు జేసీకి విజ్ఞప్తి చేశారు. పరిహారం మంజూరులో ఎటువంటి అపోహలకు పోవద్దని, రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. జాతీయరహదారి పనులకు ఆటంకం కలగకుండా సహకరించాలన్నారు. బి.సావరం, పాలగుమ్మి, శివకోటి గ్రామాలకు చెందిన రైతులు, తహసీల్దారు బి.ఎం.ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జేసీ ధ్యాన్‌చంద్

తాళ్లమ్మ ఆలయానికి హుండీ బహూకరణ

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారి ఆలయానికి భక్తుడు ఇత్తడి హుండీ బహూకరించారు. అమ్మవారి పుట్టింటి వారు కీర్తిశేషులు సీజీ దాస్(మాజీ సర్పంచ్) శశిరేఖ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు సీడీ గోవిందుబాబు, లక్ష్మిగిరి దంపతులు, మనుమరాలు గౌతమీరేఖ సుమారు 50 వేలు వ్యయంతో ఇత్తడి హుండీని తయారు చేయించి ఆలయ కమిటీకి అందచేశారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ మిద్దే సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఆలయ ఆసాదులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయంలో అమర్చారు. అనంతరం ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సెక్రటరీ మంతెన సాయిబాబు, సభ్యులు, స్థానికులు, అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



తాళ్లమ్మ ఆలయానికి హుండీ సమర్పించిన గోవిందుబాబుతో ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

మామిడికుదురు: పెదపట్నంలంకలోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. బాబాకు పూజలు చేశారు. కాకడ హారతి, అభిషేకాలు, మంగళ స్నానం చేయించారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య పుష్పాభిషేకం, నెయ్యాభిషేకం, పంచామృతాభిషేకాలు, హారతులు వైభవంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సాయిబాబాను దర్శించుకున్నారు.

మట్టి తరలిస్తున్న ఐదు లారీల సీజ్

ఆరుగురిపై కేసు నమోదు

పి.గన్నవరం: మండలంలోని మొండెపులంక ర్యాంపు నుంచి అనుమతులు లేకుండా లంక మట్టిని తరలిస్తున్న ఐదు లారీలను ఎస్ఈబీ అధికారులు బుధవారం సీజ్ చేసి, పోలీసులకు అప్పగించారు. ఈ ర్యాంపు నుంచి మట్టిని తరలించేందుకు కొన్ని లారీలకు అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎస్ఈబీ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేని నంబర్లు కలిగిన ఐదు లారీలు అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్టు గుర్తించారు. వాటిని పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీ యజమానితో పాటు ఐదుగురు డ్రైవర్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.గంగాభవాని వివరించారు.



ఎస్ఈబీ అధికారులు సీజ్ చేసిన మట్టి లారీలు

కొబ్బరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

అంబాజీపేట: సస్యరక్షణ చర్యలు చేపట్టి గ్యానోడెర్మా, నల్లమచ్చ తెగుళ్ల నుంచి కొబ్బరి తోటలను కాపాడుకోవాలని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం తెగుళ్ల విభాగ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో పార్వతీపురం రావేప్ విద్యార్థులు కొబ్బరి తోటలను ఆశించే తెగుళ్లపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోవర్ధనరావు మాట్లాడుతూ కొబ్బరిలో తెగుళ్లను సకాలంలో గుర్తించి శాస్త్రవేత్తల సూచనలు, యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల మేలు జరుగుతుందన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో కొబ్బరి తోటలను ఆశించిన గ్యానోడెర్మా, నల్లమచ్చ తెగుళ్లను రావేప్ విద్యార్థులు, రైతులకు అవగాహన కల్పించారు.

ఓటు పౌరుడి ఆయుధం

- ఘనంగా ఓటర్ల దినోత్సవం
- సీనియర్ సిటిజన్లకు సత్కారం



కొత్తపేటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్ కేపీ రాజు



సీనియర్ ఓటరును సత్కరిస్తున్న బూత్ లెవిల్ ఆఫీసర్ అనిలకుమారి

కొత్తపేట: ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఆయుధం 'ఓటు హక్కు' అని, ఆ హక్కును నిజాయితీగా వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని స్థానిక ఆర్డీఓ, నియోజకవర్గ ఆర్ఓ ఎం.ముక్కంటి ఓటర్లకు పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నియోజకవర్గ కేంద్రం కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు సంయుక్త ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆర్డీఓ మాట్లాడారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై తహసీల్దార్ కిషోర్‌బాబు అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. నూతన ఓటర్లకు ఓటు గుర్తింపు కార్డులు అందజేశారు. ఓటు హక్కు, విలువలపై రంగోలి, వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్ అరుణ్‌కుమార్, ఎలక్షన్ డీటీ విజయలక్ష్మి, డీటీ ఎస్.శ్రీనివాస్, ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, సీనియర్ అసిస్టెంట్ అర్జమ్మ, మండల వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సత్తిరాజు ఆదిత్యకిరణ్, కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ టీ రమాదేవి, పొలిటికల్ సైన్స్ హెడ్ డి.నాగ దీపిక పాల్గొన్నారు.

మలికిపురం: గుబ్బలపాలెం యూపీ స్కూల్‌లో బుధవారం ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ చెల్లుబోయిన శేషారత్నం పాల్గొని మాట్లాడుతూ ఓటు హక్కు భారత రాజ్యాంగం కల్పించిన గొప్ప ఆయుధమని అన్నారు.

అంబాజీపేట: ఓటు వెలకట్టలేనిదని, అమ్ముకోకుండా నమ్ముకుందామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆర్ఐ ఎండీ.ఇబ్రహిం అధ్యక్షతన జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా బుధవారం ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్ మంచికంటి మాణిక్యంను సత్కరించారు.

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిపాలెం సెంటర్లో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. స్థానిక 57వ పోలింగ్ బూత్‌లో సీనియర్ ఓటరైన పెద్దింటి జగన్నాథాచార్యులను బూత్ లెవిల్ ఆఫీసర్ ఎం.అనిలకుమారి శాలువాతో సత్కరించారు. వలంటీరు మార్గాని పద్మావతి, టీచర్ విజయలక్ష్మి, కె.దుర్గ రమణ, మణిశ్రీ, సౌగమణి, కరుణ పాల్గొన్నారు.